# డెలివరీ

చీకటి చిక్కపడుతోంది...

శిథిలమైపోతున్న తాటాకులతో చింపిరి జుత్తుతో కూచున్న పిచ్చిదానిలా...పూరి గుడిసె. పోస్ట్‌మాన్ సాయిలు సైకిల్‌దిగి గుడిసెలోకి నడిచాడు. అప్పుడే.... వంగిపోయిన శరీరంతో, వణుకుతున్న చేతుల్తో గుడ్డిదీపాన్ని వెలిగించింది రాజవ్వ. అలికిడి విని ఎవలూ... అంది.

"నేనత్తా... టప్ప సాయిల్ని" అన్నాడు నులకమంచంలో కూచుంటూ.

"గిప్పుడు తీరిందా బిడ్డా... నాలుగచ్చరాలు రాసుటానికి నాలుగు నెల్ల కత్తివి" అంది సాయిలు మంచంపక్కనే నేలమీద కూచుంటూ. గుడ్డిదీపం గుడిసెనిండా వాళ్లనీడల్ని సాగదీస్తోంది. వూరు నిశ్శబ్దంలోకి ఒరిగిపోతుంది.

"మొన్నటిదాకా స్ట్రయిక్‌జేత్తిమి. ఉత్తరాలు రాకపోయే పోకపాయే ఇగ సుధాకర్‌కు రాసి ఏం ఫాయిదాని ఇగజెప్పు... కొడుక్కు ఏం జప్తవో... అంటూ కాగితం మీద అప్పటికే పెన్నుతో ప్రియమైన కొడుకు సుధాకర్‌కు మీ అవ్వ రాజవ్వ దీవించి వ్రాయినది నేను క్షేమం. నువ్వు క్షేమంగా వుండాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నాను... అని రాసేసాడు.

రాజవ్వ చెప్పటం మొదలెట్టింది.

"ఏం జెప్పాలె బిడ్డా... నిప్పుల్ల మొలిసింది ఎండకు చస్తదా అన్నట్టు నాపుటుకే కష్టాల పుటుకాయె. సుధాకర్‌గాడు పుట్టంగనే తండ్రి కాలంజేసె. వానల్ల సినుకునై, ఎండల్ల

చెమటసుక్కనై ఎన్ని కట్టాలు పడి వాన్నిపెంచిన. ఆడేమో... పత్తాలేకుండా బొంబాయి పోయె. గీ ముసల్దాని చావును జూసుటానికన్నా రావాలని లేకపోయే. నేను చస్తే చస్తి గని... కొడుకు ఊడల మర్రి కింద ఉడుతపిల్లలెక్కగా బొంబాయిల ఎట్లున్నాడో... ఏం జేత్తున్నడో..." రాజవ్వ కళ్లల్లో కొడుకు కదలాడి కన్నీటి తెరలు కమ్మాయి.

"నీయమ్మా... నీసోది ఎనకసీరి జెప్పు.... ముందైతే ఏం రాయాల్నో జెప్పరాదు... అవతల నాకు పనుంది." రాజవ్వ వైపు జాలిగా చూస్తూనే కోపంగా అన్నాడు సాయిలు.

"ఇగ ఏం జెప్పాలె బిడ్డా... నీకు దెల్వదా ? ఆడు ఇంటికి రాక రెండేండ్లాయే. ఓ పిల్లనంట జెత్తిమి. కొడుక్కి కోడల్దానికి పడక ఇడాకులాయె. దానికి బీడీలు చేసుటానిక్కూడా నామోసి అన్పిచ్చే. దాని షోకులు నచ్చక రోజు కాట్లె కుక్కలెక్క కొట్టాడుకుండ్రి. ఆర్నెల్లు సంసారం చేయకముందే సుధాకర్‌గాడు నాల్గువేల రూపాలు ఎదురిచ్చి పంచాయితీల ఇడాకులు దీస్కనే. గా పంచాయితీ అయినంక పోయిండంటే... రెండేండ్ల నుంచి ఇల్లు ముఖం జూడకపాయె. రెండుసార్లు నాకు పైసలు పంపిండు. ముసల్ది ఎట్లుందో అని సూడరాకపోయె. బండకన్న సెమట పుట్టది గని ఈనికి కనికరం పుట్టకపాయె. ఆళ్ల అయ్యలెక్కనే కఠినపోడు బిడ్డా..." రాజవ్వ చెప్పిందాంట్లో సాయిలుకి ఏం రాయాలో అర్థం కాలేదు. అయినా రెండేళ్ల నించీ ఎదిరిచూస్తున్నట్టు రాసాడు. తొందరగా రమ్మని తన ఆరోగ్యం బాగాలేదని రాజవ్వ తరపున మరో నాలుగు వాక్యాలు రాసాడు.

రాజవ్వ కొంగుతో కళ్లొత్తుకుంది.

ఇంకేం రాయాల్నో చెప్పు అడిగాడు సాయిలు.

"ఎక్కడ తింటండో... ఎక్కడ పంటండో తెల్వకపాయె. ఇప్పటికి రెండేళ్ల నించి పదికారట్లు నువ్వేరాసినవ్ గదరా సాయిలూ... ఒక్కదానికన్నా జవాబిచ్చిండా ? పైసలు పంపితేనే మా అవ్వ సల్లగుంటదనుకుంటుండా... పంచాయితీల ఇడిసి పెట్టిందేమో మారుపెండ్లి జేస్కోని ఓ బిడ్డని కనె. ఈనికి మల్ల పెండ్లి చేసుకోవాలని కూడా లేకపాయే. గా ఓరుగంటి లచ్చన్న బిడ్డని ఈనికి ఇద్దామని అడుగుతుండ్రు. ఈడేమో ఒక్కసారన్నా ఇంటికి రాకపాయె. గీ గుడిసె మొత్తం ఉరువవట్టే.... నా కండ్లేమో మసక బారవట్టే. గీ గుడిసె ముందు తెల్లముగ్గు పడక ఎన్ని రోజులాయె కొడుకా... శుక్కురారం శుక్కురారం గుడిసెను పుట్టమన్నుతోని అలుకుతె నడుం లెత్తలేకపాయె. మొగుడు బతికుండంగ సుఖం లేకపాయె కొడుకును కన్నా సుఖం లేకపాయె. నేనేమన్నా పర్వాన్నాలు అడిగితినా... పక్వాన్నాలు అడిగితినా బిడ్డా... బొంబాయిల బతికేకన్నా ఉన్నూర్లనే మల్ల పెండ్లి జేస్కోని నన్నవతలేసినంక ఎక్కడికన్నా

పొమ్మని రాయిబిడ్డా..." అంది. కళ్లల్లో నీటి తెమ్మెరలు పూర్తిగా కమ్ముకుంటుంటె.

రాజవ్వ మాటల్లోని భావాన్ని అక్షరాల్లో కూర్చుతూ గుడిసె పాడైందని, తన ఆరోగ్యం చెడిపోయిందని, వెంటనే రావల్సిందని, వచ్చి మళ్లీ పెళ్ళి చేస్కోవల్సిందని మరో పది వాక్యాలు రాసాడు.

అప్పుడే గుడిసెకు కొద్ది దూరంలోంచి పోలీస్‌జీపు రోదపెట్టుకుంటూ పోయింది. దర్వాజాలోంచి సాయిలు అటువైపు తొంగిచూసి మల్లా పోలీసోల్లు వచ్చినట్టున్నరు అన్నాడు కొంచెం బాధగా.

"గదేందో బిడ్డా... ఒక్కోసారి గీ పోలీసోల్లను సూత్తుంటె సుధాకర్‌గాడు బొంబాయిలున్నదే నయమనిపిత్తాంది. మొన్న తరాల బుచ్చోని కొడుకుని పట్టుకపోయిండ్రట గాదు" అంది రాజవ్వ.

"సరే... ఇంకేం రాయాల్నో చెప్పు" నిట్టూర్పు విడిచాడు సాయిలు.

రాజవ్వ తలగోక్కుంటూ...

"ఇంకేం రాస్తవ్ బిడ్డా... నన్ను ఊరుపొమ్మనవట్టె... కాడు రమ్మనవట్టె... ఎన్ని నొప్పులు పడి ఆన్ని కంటి... ఆ పోరన్ని కనంగ నాఆగం జూసి మంత్రసాని ఎల్లవ్వ తొడమీద గిచ్చితె బిడ్డా... కమిలిపోయి బొగ్గులెక్క నల్లటి మచ్చయింది. ఆ మచ్చ ఇంకా ఉంది. ఈడు మాత్రం నా ఎదురుంగ లేకపాయె. గీ పొద్దు గూకంగ గుడిసెముందు కూసుంటె ముందొచ్చే లేగల్ని, ఎనకచ్చే ఆవుల్ని జూసినా కడుపు తరుక్కుపోతది బిడ్డా. నా బతుకు పసువుకన్న ఈనమైపాయె. ఉండి లేని సమానమైతి అని రోజు మంచంల పడి కండ్లనీళ్లు దీస్కుంటున్న. తిన్నవ, పన్నవా రా. వ్వా అని అడిగే గతిలేకపాయె..." ఈ సారి రాజవ్వ గొంతులో కన్నీటి కెరటాలు ఢీ కొట్టుకు న్నాయి.

సాయిలు మ. సు కూడా బరువెక్కింది.

ఏం రాయాలో అర్థం కాలేదు...

ఆమె కన్నీళ్లని అక్షరాలుగా మార్చడానికి అతిప్రయత్నం చేస్తూ ఉత్తరం పూర్తిచేసాడు. ఇంకా గంటల తరబడి ఇలాగే చెప్తుందని సాయిలుకు తెల్సు. అందుకే కాగితం మడిచి జేబులోంచి కవర్ తీసి అందులో పెట్టాడు.

"రేపు పోస్టు చేస్తగనీ.... అడ్రసుందా ?" అనడిగాడు

"పత్తె నా బిడ్డా.. గదే రెండేండ్ల కింద ఉత్తరమే. గండ్లనే వుండాలె" అంటూ పాత

సందుగ లోంచి తడిమి తడిమి వెలిసిపోయిన ఓ ఇన్లండ్ లెటర్ తెచ్చిచ్చింది.

దాంట్లోని అడ్రస్ కవర్‌పై రాసి తిరిగి ఇన్లాండ్ లెటర్ రాజవ్వకిచ్చాడు.

"సరే...నేను వోతున్న..." అన్నాడు లేస్తూ

"ఆడి ఉత్తరమొత్తె జెల్ది తెచ్చియ్ బిడ్డా... నీ కాల్మొక్తా." అంది ప్రాధేయపూర్వకంగా

"గవేం మాటలత్తా... నాకు దెల్వదా ? నిన్నిడిసి అతీగతీ లేకుండా పోయిండు.

ఆడు వూర్లెకచ్చిన్రోజు ఈడ్చి ఇరవై అయిదు దొబ్బుతా" అన్నాడు.

అప్పుడే...కీచ్‌మన్న శబ్దంతో గుడిసె ముందు జీపాగింది. సాయిలు అనుమానంగా చూసాడు. ఇద్దరు కానిస్టేబుల్లు వేగంగా గుడిసె దగ్గరికి వచ్చి..

సుధాకర్ ఇల్లు ఇదేనా ? అనడిగాడు.

"అవ్‌బిడ్డా... నా కొడుకచ్చిండా ?" అంది రాజవ్వ వాళ్లమాటవిని.

"అవున్సార్... ఈమె సుధాకర్ తల్లి... సుధాకర్‌కు ఏమైనా యాక్సిడెంట్ అయిందా' అనడిగాడు సాయిలు.

"యాక్సిడెంటు కాదు...ఎన్‌కౌంటర్లో సుధాకర్ చచ్చిపోయిండు." ఒక కానిస్టేబుల్ చెప్పాడు. ఆలోగా మరో ఇద్దరు కానిస్టేబుల్స్, ఎస్సయ్ జీపుదిగి వచ్చాడు.

"ఈ ముసల్దాని కొడుకేనా ?" ఎస్సయ్ అడిగాడు.

'అవునట సార్' మరో కానిస్టేబుల్ చెప్పాడు.

"నువ్వెవరు ? అని ఎస్సయ్ అడగటంతో నేను ఈ వూరి పోస్ట్‌మన్‌ని సర్" అని చెప్పాడు సాయిలు.

"చూడు... మధ్యప్రదేశ్ అడవుల్లల్ల జరిగిన ఎన్‌కౌంటర్లో సుధాకర్ అలియాస్ ప్రద్యుమ్న చచ్చిపోయాడు. వాడి దగ్గర దొరికిన డైరీ ఆధారంగా అతడిదీ వూరని తెల్సింది. తల్లిపేరు రాజవ్వ అని తెల్సింది. శవాన్ని అప్పగించడానికొచ్చాం."

ఎస్సయ్ మాటలు సాయిల్తోపాటు రాజవ్వకు కూడా పూర్తిగా అర్థమయ్యాయి.

అప్పటికే విషయం తెల్సిన వూరు బిక్కుబిక్కుమంటూ కదిలివస్తోంది.

"నా కొడుకు అన్నలల్ల కల్సిండా... ఎప్పుడు కల్సిండు... ఎన్నడు కల్సిండు...

కొంగుసాటుపోరడు... ఆడు బొంబాయిల్నే వుండవట్టే... ఓరి దేవుడో... గిప్పుడే ఉత్తరం రాయించినా... నీ గుల్లె మన్ను వడా...'' అంటూ శోకం పెట్టింది. వూర్లోవాళ్లు ఒక్కొక్కరుగా అక్కడికి చేరుకుని దూరంగా నిల్చొని చూస్తున్నారు. రాజవ్వ శోకం ఆకాశాన్నంటింది.

సాయిలు నిశ్చేష్టుడై వుండిపోయాడు.

ఇంతలో నలుగురు పోలీసులు తెల్లగుడ్డలో చుట్టిన ఒక శవాన్ని జీపులోంచి దించుకొచ్చి గుడిసె ముందుంచారు.

సర్పంచి, ఉప సర్పంచి వచ్చి ఎస్సైతో మాట్లాడారు. సాయిలు వారిస్తున్నా గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. ఆ వృద్ధురాలి దుఃఖం తెరలు తెరలుగా వచ్చి అందరి మనసుల్ని కలచివేస్తోంది. పోలీసులు శవాన్ని అప్పగించినట్టుగా సంతకాలు తీస్కున్నారు.

రాజవ్వ శవం మీదపడి బోరుమంది.

“ఒక్కసారి నా కొడుకు ముఖం చూపియ్యుండ్రి...

నా కొడుకు మొఖాన్ని ఆఖరిసారి చూస్కుంట...

మీ బాంచెను... నా కొడుకు ముఖం చూపియ్యుండ్రి..''.

రాజవ్వ ఏడ్పుకి ఓ కానిస్టేబుల్ దగ్గరగా వచ్చి

“ఏం జూస్తవే ముసల్దానా... బుల్లెట్ దెబ్బలకు మొఖమంత చిట్లిపోయింది.'' అంటూ కసురుకున్నాడు.

పోలీసులు మళ్లీ జీపెక్కారు.

వణుకుతున్న శరీరంతో రాజవ్వ దిగ్గున లేచింది...

జీపెక్కబోతున్న ఓ కానిస్టేబుల్ షర్ట్‌ని పట్టుకొని వూగిపోతూ... ఏడుస్తూ అడిగింది.

“కొడుకా... ఏ పనిపడ్డా పెభుత్వమే మన ఇంటి ముందు కొత్తది అన్నారు.

అంటే గిదేనా ప్రజల వద్దకు పాలన అంటే గిదేనా బిడ్డా....

ఆఫీసుల చుట్టు తిరగకుండ్రి... అన్నీ మన దగ్గరికే వత్తయన్నరు

దానర్థం గిదేనా బిడ్డా...'' అంటూ ఏడుస్తూ కూలబడింది.

సాయిలు చేతిలోని ఉత్తరం కిందబడింది.

రివర్స్‌లో వచ్చి ముందుకు కదిలిపోయిన జీపు టైర్ల కిందబడి అది నలిగిపోయింది.